# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దేశ పారిశ్రామిక రంగాన్ని మరింతగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
2. అమృత్-2.0లో భాగంగా నిర్ధేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులని ఆదేశించారు.
3. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
4. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో పర్యటిస్తారు.
5. తెలుగు భాషను పరిరక్షించి .. ఆ భాష ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి తెలియ జేసే ఉద్దేశ్యంతో ఈ రోజు తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు.
6. తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ 9వ తేదీన ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.

==========================

దేశ పారిశ్రామిక రంగాన్ని మరింతగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలను తీసుకుంటోందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఢిల్లీలో నిన్న జరిగిన కేంద్ర మంత్రి వర్గ నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వివరించారు.... జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద దేశంలో కొత్తగా 12 కొత్త గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామిక స్మార్ట్ సిటీల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని వెల్లడించారు. వీటిలో తెలుగు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఓర్వకల్లు, కొప్పర్తి తెలంగాణలో జహీరాబాద్‌ను అభివృద్ధి చేయనున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 36.. సెకన్లు....

అలాగే దేశంలోని మొత్తం 234 నగరాల్లో 730 ప్రైవేట్ ఎఫ్‌ఎం కేంద్రాల ఏర్పాటుకు, 6 వేల 456 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో మొత్తం 296 కిలోమీటర్ల పొడవున్న 3 ప్రధాన రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి తెలిపారు.

------------------------

అమృత్-2.0లో భాగంగా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులని ఆదేశించారు. తాగునీరు,జల్ జీవన్ మిషన్,పారిశుధ్యం,జాతీయ రహదారులు రైల్వే ప్రాజెక్టులు వంటి అంశాలపై నిన్న ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, పారిశుద్ధ్య నిర్వహణ ప్రాజెక్టులను త్వరిత గతిన పూర్తి చేయాలని, నూతన రైల్వే,రోడ్డు ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అమృత్ 2.0 కింద పట్టణాల్లోని ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, పాల్గొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో నిన్న జరిగిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, నిర్మాణానికి కేలండర్ ప్రకటించడం హర్షణీయమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం కలుగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియచేశారు. పోలవరం ప్రాజెక్టుకు 12 వేల 127 కోట్ల రూపాయలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, అలాగే, పోలవరాన్ని 2027 మార్చిలోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో పర్యటిస్తారు. ఈ ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం ఐఎన్ఎస్ డే గా నేవల్ బేస్‌కు చేరుకుని అక్కడ జరిగే తూర్పు నౌకాదళ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమ అనంతరం కేంద్రమంత్రి తిరువనంతపురం బయలుదేరి వెళతారు.

---------------------------

తెలుగు భాషను పరిరక్షించి .. ఆ భాష ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి తెలియ జేసే ఉద్దేశ్యంతో ఈరోజు తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు. తెలుగు భాషా వైభవానికి పునాదులు వేసిన మహనీయుడు, వ్యావహారిక భాషోద్యమ కర్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. తెలుగులో పామరులు సైతం అర్థం చేసుకునేలా వాడుక భాషకు పట్టం కట్టిన గిడుగు రామమూర్తి పంతులు శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగం పర్వతాల పేటలో 1863 వ సంవత్సరం ఆగస్టు 29వ తేదీన జన్మించారు. ఆంధ్రప్రదేశ్ అంతటా పర్యటిస్తూ తెలుగు భాషా, విద్య, శాసన పరిశోధన, చరిత్ర పరిశోధనలకు సంబంధించిన ఎన్నో ఉద్యమాలు నిర్వహించారు. గ్రాంథిక భాషలో వున్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి... నిత్య వ్యవహారిక భాషలో వున్న చక్కదనాన్ని, సౌలభ్యాన్ని తెలియజెప్పారు. బహుభాషావేత్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు 1940వ సంవత్సరం జనవరి 22 వ తేదీన తన 76వ ఏట తుది శ్వాస విడిచారు.

---------------------------

గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవంగా అధికారిక కార్యక్రమంగా నిర్వహించడం ఎంతైనా సముచితం. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రినరేంద్ర మోదీ తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు ఎంతో అద్భుతమైన భాష అని నరేంద్రమోదీ కొనియాడుతూ..

వాయిస్ (17 సెకన్లు)

ఇలా ఉండగా తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రముఖ చలనచిత్ర నటులు, రచయత తనికెళ్ళ భరణితో ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

-------------------------

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ఇతర రాష్ట్రాలలోనూ, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలుగు ప్రజలందరికి అభినందనలు తెలియజేస్తున్నానని తెలిపారు. తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహులు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్న ఈ సందర్భంగా అందరూ తెలుగు భాష ఔన్నత్యానికి కృషి చేయాలని, తెలుగు భాష గొప్పతనాన్ని చాటాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

-------------------------

తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ 9వ తేదీన ఆవిష్కరించనున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి నిన్న భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రగతి భవన్‌ను.. ప్రజాభవన్‌గా మార్చి, అక్కడే ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. గత 10 సంవత్సరాలు పాలించిన వారు తెలంగాణ తల్లిని తెరమరుగు చేశారని విమర్శించారు. సచివాలయం తెలంగాణ పరిపాలనకు కేంద్రబిందువు అని, రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే ఇక్కడి నుంచే విధానపర నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. పాత విధానాలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రజాపాలన చేపట్టిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

-------------------------

ప్రజా పాలనలో భాగంగా తెలంగాణలో వచ్చేనెల 17వ తేదీ నుంచి నూతన రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ళ దరఖాస్తులు స్వీకరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అభివృద్ధి ప్రాజెక్టులను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వేములవాడ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తిరుమల తరహాలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేశామని మంత్రి తెలిపారు.

-------------------------

హైదరాబాద్‌లో ఈ నెల 30 వ తేదీన జాతీయ ఫిజికల్ భద్రత సదస్సును నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ కె. శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేశ విదేశాల నుంచి ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవు తారన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని తెలిపారు. సదస్సులో జాతీయ స్థాయిలో సైబర్, మహిళా, ట్రాఫిక్ భద్రత వంటి పలు రంగాల ప్రతినిధులు పాల్గొని చర్చిస్తారని చెప్పారు.

======================